సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

గురువారం । 17 । జూలై । 2025



మహిళలు రాజకీయంగా ఎదగాలి

మహిళలు రాజకీయంగా ఎదగాలని రాష్ట్ర ప్రణాళికాబోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి అన్నారు.

- 8లో▸



ప్రభంజన్‌కుమార్ కన్నుమూత

బహుజన, సామాజిక ఉద్యమకారుడు, సీనియర్ జర్నలిస్టు ప్రొఫెసర్ ప్రభంజన్‌కుమార్ బుధవారం కన్నుమూశారు.

- 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం $33^0/24^0$

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత అక్కడక్కడా చిరులు జల్లులు కురుస్తాయి. సాయంత్రం సమయంలో ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పూర్తి ఫీజు రాయితీ



రామన్నపేట : టీజీ పాలిసెట్ -2025 కౌన్సెలింగ్‌లో పాల్గొంటున్న అభ్యర్థుల్లో ప్రభుత్వ, జిల్లా పరిషత్, నవోదయ, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ శాఖల ఆధ్వర్యంలోని రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు పూర్తి ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పించనున్నట్లు వరంగల్ పాలిటెక్నిక్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్, టీజీ పాలిసెట్ హెల్ప్‌లైన్ సెంటర్ క్యాంప్ ఆఫీసర్ డా.బైరి ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈరాయితీ పొందాలంటే అభ్యర్థులు ఈనెల 18వ తేదీలోపు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వరంగల్ హెల్ప్‌లైన్ సెంటర్‌ను సందర్శించి తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 94921 10750 నంబర్‌లో సంప్రదించాలని, లేదా అధికారిక వెబ్‌సైట్ http://tgpolycet.nic.inను సందర్శించాలని కోరారు.

ప్రజలకు నమ్మకం కలగాలి



కాజీపేట: పోలీస్ స్టేషన్‌కు వెళ్తే న్యాయం జరుగుతుందని ప్రజలకు నమ్మకం కలిగేలా అధికారుల చర్యలు ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. కాజీపేట పోలీస్ స్టేషన్‌ను బుధవారం సీపీ వార్షిక తనిఖీల్లో భాగంగా సందర్శించి సిబ్బందికి సూచనలిచ్చారు. సీఐ సుధాకర్‌రెడ్డి సీపీకి పూలమొక్క అందించి స్వాగతం పలికారు. సాయుధ పోలీసులు గౌరవ వందనం చేశారు. పోలీస్ సిబ్బంది చేసిన పరేడ్‌తో పాటు కిట్ ఆర్టికల్స్‌ను తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ రిసెప్షన్, సీసీటీఎన్ఎస్ విభాగాల పనితీరును సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డుల్ని పరిశీలించి కేసుల పూర్వాపరాలు, రికార్డుల నిర్వహణ బాగుందని అభినందించారు. పక్కనే ఉన్న ట్రాఫిక్ పీఎస్‌ను సందర్శించి క్షేత్రస్థాయి సమస్యలపై చర్చించారు. తనిఖీల్లో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డి, సీఐ సుధాకర్ రెడ్డి, ఎస్సైలు నవీన్‌కుమార్, లవన్‌కుమార్, శివ పాల్గొన్నారు.

'యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్'తో ఎంఓయూ



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని కో–ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలకు, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్‌కు మధ్య ఎంఓయూ (అవగాహన ఒప్పందం) కుదిరింది. ఈఒప్పందం ద్వారా 250 మంది విద్యార్థులకు సాఫ్ట్‌స్కిల్స్, డేటా సైన్స్ తదితర అంశాల్లో కేంద్రీకృత శిక్షణ ఇవ్వనున్నారు. ఈశిక్షణతో విద్యార్థుల్లో ఉద్యోగావకాశాల కోసం అవసరమైన నైపుణ్యాలు పెంపొందిస్తారు. పరిశ్రమలకు అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను సన్నద్ధం చేయడమే ఈ ఒప్పంద లక్ష్యం అని ఆకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమణ బుధవారం తెలిపారు. ఎంఓయూపై కేయూ వీసీ ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ మేనేజర్ భరత్, సీనియర్ అసోసియేట్ సౌమ్యమైరెడ్డి సమక్షంలో ఎంఓయూ చేసుకున్నారు. కార్యక్రమంలో ఆకళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మహేందర్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సంతోశ్‌కుమార్ పాల్గొన్నారు.

'కే హబ్' సందర్శన



కేయూ క్యాంపస్: హైదరాబాద్‌లోని టీహబ్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ తాలూకా, స్టాఫ్ డైరెక్టర్ బెంజిమిన్ బుధవారం కాకతీయ యూనివర్సిటీలోని కే హబ్‌ను సందర్శించారు. ఈపర్యటన సందర్భంగా వారు కే హబ్‌లోని వసతులు, మౌలిక సదుపాయాలు, స్టార్టప్ సంస్థల అభివృద్ధికి అనుకూలంగా ఉండే సాంకేతిక శాస్త్రీయ వాతావరణ పరిస్థితులపై వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రంతో చర్చించారు. త్వరలోనే టీ హబ్, కే హబ్‌కు మధ్య ఎంఓయూ చేసుకోనున్నట్లు రిజిస్ట్రార్ వి.రామచంద్రం వెల్లడించారు. కార్యక్రమంలో రూసా నోడల్ ఆఫీసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, కేయూ దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ ఆచార్య బి.సురేశ్ లాల్, కె హబ్ డైరెక్టర్ టి.సవితాజ్యోత్స్న, డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎన్.వాసుదేవరెడ్డి, బొల్లం కిరణ్‌కుమార్, సిద్ధార్థ తదితరులున్నారు.

'మోడల్'కు మోక్షమెప్పుడో?

నాలుగేళ్లయినా పూర్తికాని మార్కెట్ల పనులు

- బల్దియా ఇంజనీర్ల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం
- అపరిశుభ్రత నడుమ చేపలు, మాంసం, పండ్లు విక్రయాలు
- అనారోగ్యం బారిన పడుతున్న నగరవాసులు





వరంగల్ లక్ష్మీపురంలో పూర్తికాని మోడల్ మార్కెట్ నిర్మాణం, హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ స్టోర్ పక్కన నిలిచిన మోడల్ మార్కెట్ అభివృద్ధి పనులు

వరంగల్ అర్బన్: వరంగల్ మహా నగరంలో అభివృద్ధి పనులు ఏళ్లుగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా నాలుగేళ్ల క్రితం ప్రారంభించిన మోడల్ మార్కెట్ల పనులు ఇంకా పూర్తికాలేదు. స్లాబ్, గోడలకే పరిమితమైనా బల్దియా ఇంజనీర్లు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. నిధులు లేకనే మార్కెట్ల నిర్మాణం ముందుకుసాగట్లేదు. బిల్లులిస్తేనే పనులు చేస్తామని కాంట్రాక్టర్లు మొండికేశారు.

8 మార్కెట్లలో సౌకర్యాలు కరువు..

రోడ్లకిరువైపులా, మురికి కాల్వల పక్కన, దుమ్ము ధూళి నడుమ చేపలు, మాంసం, పండ్లు, కూరగాయలు, పూలను చిరువ్యాపారులు విక్రయిస్తున్నారు. నగరంలోని 8 మార్కెట్లలో కనీస సౌకర్యాలు లేవు అపరిశుభ్ర వాతావరణంలోనే విక్రయాలు కొనసాగుతున్నాయి. గత్యంతరం లేక ప్రజలు కొనుగోలు చేస్తూ అనారోగ్యం బారిన పడుతున్నారు.

హనుమకొండ నక్కలగుట్టలో..

హనుమకొండ నక్కలగుట్టలోని ఇరిగేషన్ బోర్డు సర్కిల్ కార్యాలయ ఆవరణలోని రెండు ఎకరాల విస్తీర్ణంలో 131 స్టాళ్లకు సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు మొదలు పెట్టారు. రూ.4.50 కోట్ల నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం జీఓ 65 విడుదల చేసింది. ఈ నిధులతో నాలుగేళ్లలో మూడు స్లాబ్‌లు వేసి చేతులు దులుపుకున్నారు. సదుపాయాలు కల్పించేందుకు రూ.4.80 కోట్ల నిధులు కేటాయించాలని ఈఎన్‌సీకి నివేదించినట్లు బల్దియా ఇన్‌చార్జ్ ఈఈ సంతోశ్ తెలిపారు. ఈ నిధులు విడుదలైతేనే పనులు మళ్లీ ప్రారంభం కానున్నాయి.

మంజూరైనవి నాలుగు.. పనులు ప్రారంభించినవి రెండు

నగర జనాభాకు అనుగుణంగా మార్కెట్లు లేవు. 50 వేల జనాభాకు ఒక మార్కెట్ ఉండాలి. ఒకటి పెద్ద మార్కెట్ కాగా.. మధ్య, చిన్న తరహా మొత్తం 8 మార్కెట్లు మాత్రమే ఉన్నాయి. 2015లో అప్పటి సీఎం, పురపాలక శాఖ మంత్రి ఆదేశాలతో మోడల్ మార్కెట్లు నిర్మించాలని సూచించారు. స్థలాల అన్వేషణ కోసం సుమారు ఆరున్నరేళ్లు పట్టింది. వరంగల్ లక్ష్మీపురం, అండర్ రైల్వేగేట్ నాగమయ్య గుడి పక్కన, హనుమకొండ నక్కలగుట్ట, కాజీపేట జూబ్లీమార్కెట్ ప్రాంతాల్లో నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కానీ.. ఏమైందో తెలియదు. తొలుత లక్ష్మీపురం, నక్కలగుట్టలో 2021 ఏప్రిల్‌లో మోడల్ మార్కెట్ల పనులు ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు నిర్మాణ దశలో ఉండడంతో విమర్శలు వస్తున్నాయి.

వరంగల్ లక్ష్మీపురంలో..

సికింద్రాబాద్ మోండా మార్కెట్ తర్వాత వరంగల్ లక్ష్మీపురంలోని కూరగాయలు, పండ్ల మార్కెట్ ప్రసిద్ధి చెందింది. వరంగల్, ఖమ్మం, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలకు ఇక్కడి నుంచే హోల్‌సేల్ వ్యాపారులు కూరగాయలు, పండ్లు, పూలు సరఫరా చేస్తారు. పండ్ల మార్కెట్ స్థలంలో మోడల్ మార్కెట్ నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మార్కెటింగ్ శాఖకు చెందిన 4.16 ఎకరాల విస్తీర్ణంలో సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 65 జీఓ, పట్టణ ప్రగతికి సంబంధించి రూ.24 కోట్ల నిధులు కేటాయించారు. 81 పూల దుకాణాలు, 60 మాంసం, చేపల దుకాణాలు, 105 కూరగాయల దుకాణాలు, ఒక అంతస్తులో మొత్తం హోల్‌సేల్ పండ్ల మార్కెట్ ఏర్పాటు, ఇతర మౌలిక వసతులు కల్పించేందుకు డిజైన్ చేశారు. పనులు చేపట్టి ఏళ్లు గడిచినా స్లాబ్, గోడలకు మాత్రమే పరిమితమైంది. మరో ఏడాది గడిచినా పనులు పూర్తయ్యేలా కనిపించడం లేదు. అధికారులు కాంట్రాక్టర్లపై ఒత్తిడి తెచ్చి పనులు వేగవంతమయ్యేలా చూడాలని నగరవాసులు కోరుతున్నారు. ఈ విషయమై బల్దియా ఈఈ శ్రీనివాస్‌ను వివరణ కోరగా ఇప్పటివరకు రూ.10 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయని, మరో రూ.14 కోట్లు కేటాయిస్తే నాలుగు నెలల్లో పనులు పూర్తిచేస్తామని తెలిపారు.

సమీకృత మార్కెట్లు, విస్తీర్ణం, కేటాయించిన నిధుల వివరాలు..

ప్రాంతం	విస్తీర్ణం	నిధులు	కేటాయించిన దుకాణాలు		
			వెజ్	నాన్‌వెజ్	పూలు, పండ్లు
నక్కలగుట్ట	2 ఎకరాలు	రూ.4.50 కోట్లు	59	44	28
లక్ష్మీపురం	4.16 ఎకరాలు	రూ.24 కోట్లు	105	60	81

ముందుగా జెడ్పీటీసీ, ఎంపీటీసీ!

ఆ తర్వాతే సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు

- 'స్థానిక' పోరుకు సర్కారు సమాయత్తం
- ఉమ్మడి వరంగల్‌లో స్థానాల ఖరారు.. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, పంచాయతీ స్థానాల వెల్లడి
- వచ్చే నెల మొదటి లేదా రెండో వారంలో నోటిఫికేషన్?



సాక్షిప్రతినిధి, వరంగల్ :

త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. ఈ ప్రక్రియలో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం బుధవారం గ్రామ పంచాయతీలతోపాటు ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీ, జెడ్పీ స్థానాలను ప్రకటించినట్లు పరిశీలకులు భావిస్తున్నారు. ముందుగా పేర్కొన్న విధంగానే మొదట జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించి.. ఆ తర్వాతే గ్రామ పంచాయతీలు, వార్డులకు జరిపించనున్నట్లు చెబుతున్నారు. ప్రభుత్వ ప్రకటన ప్రకారం ఉమ్మడి వరంగల్‌లోని ఆరు జిల్లాల్లో ఆరు జిల్లా ప్రజాపరిషత్‌లు, 75 జెడ్పీటీసీ స్థానాలను ఖరారు చేశారు. 778 ఎంపీటీసీ స్థానాలు 75 ఎంపీపీ స్థానాలను ప్రకటించారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీ చైర్మన్ రిజర్వేషన్లనా సందిగ్ధత నెలకొంది.

పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధం

మొదట గ్రామ పంచాయతీ ఎన్నికలు ఉంటాయని భావించిన అధికారులు ఈమేరకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి జిల్లాలో 1,708 గ్రామ పంచాయతీలు, 15,006 వార్డులు ఉన్నాయి. ఎప్పుడు నోటిఫికేషన్ ఇచ్చినా ఎన్నికలు జరిపే విధంగా 15,021 పోలింగ్ కేంద్రాలను కూడా సిద్ధం చేసినట్లు అధికారులు ఇది వరకే ప్రకటించారు. రాష్ట్ర మంత్రివర్గ ఇటీవలి సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ అందించాలని నిర్ణయించారు. ఈ రిజర్వేషన్లు సర్పంచ్, వార్డు సభ్యులు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీ, జెడ్పీ చైర్మన్‌లకు వర్తిస్తుంది. గవర్నర్ సంతకం కాగానే.. ఈ స్థానాలకు రిజర్వేషన్ ఖరారు చేయనున్నారు. ఇందుకు మరో వారం, పది రోజులు పట్టినా.. వచ్చే నెల మొదటి, రెండో వారంలో నోటిఫికేషన్ రావొచ్చన్న చర్చ జరుగుతోంది. ఈ మేరకు ప్రభుత్వం నుంచి అధికారులకు సంకేతాలు అందినట్లు కూడా చెబుతున్నారు.

ఉమ్మడి వరంగల్‌లో జెడ్పీ, జెడ్పీటీసీ, ఎంపీపీ, గ్రామ పంచాయతీలు, వార్డుల వివరాలు

జిల్లా	జెడ్పీ	జెడ్పీటీసీలు	ఎంపీపీలు	ఎంపీటీసీలు	జీపీలు	వార్డులు
హనుమకొండ	1	12	12	129	210	1,986
వరంగల్	1	11	11	130	317	2,754
భూపాలపల్లి	1	12	12	109	248	2,102
మహబూబాబాద్	1	18	18	193	482	4,110
ములుగు	1	10	10	83	171	1,520
జనగామ	1	12	12	134	280	2,534

డివిజన్‌కు ముగ్గురు!

- అనధికారికంగా మరో 40 మంది శానిటరీ జవాన్లు
- క్షేత్ర స్థాయిలో పారిశుద్ధ్య నిర్వహణపై కమిషనర్ అసహనం
- ఇద్దరు చొప్పున పని చేయాలని ఆదేశాలు



వరంగల్ స్టేషన్ రోడ్డులో పారిశుద్ధ్య పనులు పర్యవేక్షిస్తున్న జవాన్

వరంగల్ అర్బన్: వరంగల్ మహా నగర పాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ) ప్రజారోగ్య విభాగంలో శానిటరీ జవాన్లను ఇష్టారీతిన నియమిస్తున్నారు. మితిమీరిన ప్రజాప్రతినిధుల పైరవీలు, ఆమ్యామ్యాలిచ్చి రాత్రికి రాత్రే కార్మికులు.. జవాన్లుగా మారిపోతున్నారు. నగరవ్యాప్తంగా జవాన్లు మినహా 2,619 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ప్రతీ డివిజన్‌లో 30 నుంచి 35 మంది పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. కార్మికుల అటెండెన్స్ తీసుకోవడం, ఇంటింటి తడి, పొడి చెత్త సేకరణ సక్రమంగా నిర్వహించేలా, రోడ్లు శుభ్రం, డ్రెయినేజీల్లో పూడికతీత, స్వచ్ఛ ఆటోల నిర్వహణ, ప్లాస్టిక్ నిషేధం అమలు తదితర పనులు పర్యవేక్షించాలి. ట్రేడ్ లైసెన్స్ ఫీజులు వసూలు చేయాలి.

66 డివిజన్లలో 192 మంది కార్మికులు

నగరవ్యాప్తంగా 66 డివిజన్లున్నాయి. బల్దియా పర్మనెంట్ జవాన్లు 32 మంది, ఔట్‌సోర్సింగ్ జవాన్లు 160 మంది పనిచేస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రతీ డివిజన్‌కు ఇద్దరు చొప్పన జవాన్లు ఉంటే సరిపోతుంది. ఇదే విషయం ఈనెల 1న ఖిలా వరంగల్‌లో పారిశుద్ధ్య పనుల తనిఖీ సందర్భంగా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ప్రజారోగ్యం అధికారులను హెచ్చరించారు. కానీ ప్రస్తుతం డివిజన్‌కు ముగ్గురు చొప్పున విధులు నిర్వహిస్తున్నారు.

అనధికారికంగా మరో 40 మంది

డివిజన్లలో ప్రజాప్రతినిధుల సిఫార్సులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ల సహకారంతో మరో 40 మంది అనధికారికంగా జవాన్లుగా చెలామణీ అవుతున్నారు. వీరు ఎక్కడ పనులు పరిశీలిస్తున్నారో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. కార్మికులుగా పనిచేసేందుకు కొంత మంది వైట్ కాలర్స్ ఇష్టపడట్లేదు. దీంతో వీరిని అనధికారికంగా జవాన్లుగా కొనసాగిస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కార్మికుల్లో సీనియార్టీ ప్రకారం కాకుండా, ఎలాంటి విద్యార్హతలు లేని వాళ్లను జవాన్లుగా నియమిస్తుండడంతో క్షేత్రస్థాయిలో పనిచేసే వారి సంఖ్య తగ్గి, పర్యవేక్షించే వారు ఎక్కువవుతున్నారనే ఆరోపణలున్నాయి.

కార్మికులు ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి

'నమస్తే' కార్యక్రమంలో మేయర్, కమిషనర్



ప్రతిభ కనబర్చిన కార్మికులను సన్మానించిన మేయర్ సుధారాణి, కమిషనర్ బాజ్‌పాయ్

వరంగల్ అర్బన్ : కార్మికులు పనిచేయడంతోపాటు ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని నగర మేయర్ గుండు సుధారాణి కోరారు. 'నమస్తే' కార్యక్రమంలో భాగంగా బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో డి స్లడ్జింగ్ ఆపరేటర్లు, డీఆర్‌సీసీ రాక్ పిక్కర్స్‌తో మేయర్ సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ సమావేశమయ్యారు. ఉత్తమ ప్రతిభ చూపిన వారిని శాలువాలతో సత్కరించారు. అర్హులకు ఒక్కరికి రూ.5లక్షల ఆయుష్మాన్ ఆరోగ్య కార్డులు, పీపీఈ కిట్‌లు, గుర్తింపు కార్డులను అందజేశారు. సమావేశంలో సీఎంహెచ్ఓ రాజారెడ్డి, ఎంహెచ్ఓ రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి..

పారిశుద్ధ్య జవాన్లు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ సూచించారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో జవాన్లతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. పారిశుద్ధ్య కార్మికులు సమాజానికి వెన్నెముక వంటి వారన్నారు. జవాన్లు ప్రతీరోజు నాలుగు సార్లు బయోమెట్రిక్ అటెండెన్స్ వేయాలని, మ్యాన్యువల్ హాజరును పరిగణనలోకి తీసుకోరన్నారు. 15 రోజులు విధులకు గైర్హాజరైతే ఔట్ సోర్సింగ్ జవాన్లను విధులనుంచి తొలగిస్తామన్నారు. సమావేశంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల తనిఖీ

బల్దియా పరిధి కొత్తపేట పైడిపల్లి, నవభారత్ కాలనీ ప్రాంతాల్లో పూర్తయిన అభివృద్ధి పనుల బిల్లుల చెల్లింపుపై కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఆయా ప్రాంతాల్లో నిర్మించిన అంతర్గత రోడ్లు, డ్రెయిన్ల నాణ్యత, రోడ్డు వెడల్పు, లోతు పరిశీలించారు. ఎంబీ రికార్డ్ ప్రకారమే బిల్లులు మంజూరు చేస్తామని, నాణ్యతలో లోపం ఉంటే కోతలు విధిస్తామన్నారు. తనిఖీల్లో ఈఈ సంతోశ్‌బాబు, స్మార్ట్ సిటీ పీఎంఈ ఆనంద్ వోలేటి, డీఈ రవికిరణ్, ఏఈలు ఉన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు నిధులు

- హనుమకొండకు రూ.73.20లక్షలు, వరంగల్‌కు రూ.1.36కోట్లు

- వివరాలు 8లో▸

స్కూళ్లలో టీచర్ల వర్క్ అడ్జెస్ట్‌మెంట్

హనుమకొండ జిల్లాలో 140 మంది సర్దుబాటు



విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల వర్క్ అడ్జెస్ట్‌మెంట్ కసరత్తు ముగిసింది. హనుమకొండ జిల్లాలో విద్యార్థులు లేని 41 పాఠశాలలు ఉన్నాయి. ఉపాధ్యాయులు నిర్వహించిన బడిబాటలో భాగంగా స్వలంగా విద్యార్థులు చేరగా.. 9 పాఠశాలలను తెరిచారు.

సమీప మండలాల నుంచి కూడా సర్దుబాటు

జిల్లాలోని 14 మండలాల్లో ఎంఈఓలు.. ఏ మండల పరిధిలోని టీచర్లు ఆ మండల పరిధిలో వర్క్ అడ్జెస్ట్‌మెంట్ చేసేందుకు కసరత్తు చేశారు. ఉదాహరణకు హనుమకొండలో పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు ఎక్కువగా ఉండి సబ్జెక్టు టీచర్ల కొరత ఉంటే సమీప మండలాల నుంచి కూడా సర్దుబాటు చేసినట్లు తెలుస్తోంది. ఒకటి నుంచి 10 మంది వరకు విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలలకు ఒక టీచర్ చొప్పున, 11 నుంచి 60 మంది ఉంటే ఇద్దరు టీచర్లు, 61 నుంచి 90 మంది ఉంటే ముగ్గురు టీచర్లు, 91 నుంచి 120 మంది ఉంటే నలుగురు టీచర్లు, 121 నుంచి 150 మంది ఉంటే ఐదుగురు 151 నుంచి 200 మంది విద్యార్థులు, ఆపైన విద్యార్థులు ఉంటే కూడా టీచర్లు అదనంగా ఇచ్చేలా సర్దుబాటు చేశారని సమాచారం.

విద్యార్థుల సంఖ్య ఆధారంగా..

సింగిల్ టీచర్ ఉన్న ప్రాథమిక పాఠశాలలకు అవసరమైతే మరో టీచర్‌ను కేటాయించినట్లు తెలుస్తోంది. అదేవిధంగా యూపీఎస్, హైస్కూళ్లలో కూడా సర్దుబాటు చేశారని సమాచారం. ఉదాహరణకు హనుమకొండ సుబేదారి హైస్కూల్‌లో ముగ్గురు సోషల్ స్టడీస్ స్కూల్ అసిస్టెంట్లు ఉంటే అందులో ఒకరిని హనుమకొండలోని మరో ప్రభుత్వ హైస్కూల్‌కు సర్దుబాటు చేశారని తెలిసింది. విద్యార్థుల సంఖ్యను బట్టి స్కూల్ అసిస్టెంట్లను సర్దుబాటు చేశారని తెలుస్తోంది. అలాగే, పలువురు ఎస్‌జీటీలను కూడా అవసరం ఉన్న హైస్కూళ్లకు కేటాయించినట్లు సమాచారం.

వరంగల్ జిల్లాలో కసరత్తు

వరంగల్ జిల్లాలో 13 మండలాల్లో టీచర్ల వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌పై సంబంధిత ఎంఈఓలు కసరత్తు చేస్తున్నారు. పలువురు ఎంఈఓలు తమ మండల పరిధిలో టీచర్ల వర్క్ అడ్జెస్ట్‌మెంట్ చేసి జాబితాలను డీఈఓ కార్యాలయానికి పంపారు. కొన్నిమార్పులు చేయాలనే ఉన్నతాధికారుల సూచనతో ఇంకా కసరత్తు జరుగుతోందని సమాచారం. జిల్లాలో 135 జీరో విద్యార్థుల సంఖ్య ఉన్న స్కూళ్లు ఉండగా.. అందులో ఈవిద్యాసంవత్సరంలో బడిబాట ద్వారా 7 పాఠశాలలు తెరుచుకున్నట్లు తెలుస్తోంది. ఇంకా ఈప్రక్రియ మరో రెండు మూడు రోజులకు పట్టే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

కలెక్టర్ అప్రూవల్ తర్వాత ఉత్తర్వులు..

హనుమకొండ జిల్లాలోని మొత్తం 140 మంది టీచర్లను సర్దుబాటు చేశారని సమాచారం. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టీచర్లను సర్దుబాటు చేసి ఎంఈఓలు ఫైల్‌ను డీఈఓ కార్యాయానికి పంపగా.. డీఈఓ పరిశీలించి కలెక్టర్ అప్రూవల్‌కు మంగళవారం ఫైల్‌ను పంపించారని తెలుస్తోంది. కలెక్టర్ పరిశీలించి అప్రూవల్ చేశాకే రెండు మూడు రోజుల్లో వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌కు సంబంధించి డీఈఓ ద్వారా ఉత్తర్వులు వెలువడే అవకాశాలున్నాయి.

ఆరోగ్యంగా ఉండాలంటే పోషకాహారం తీసుకోవాలి

హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్



న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

హన్మకొండ అర్బన్ : క్షయ వ్యాధిగ్రస్తులు చికిత్స సమయంలో పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ ప్రాంగణంలో టీబీ విముక్తి భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మనస్ హెల్పింగ్ హ్యాండ్స్ ఫర్ ఆర్ఫన్ చిల్డ్రన్ సంస్థ వారి సహకారంతో 20 న్యూట్రిషన్ కిట్లను కలెక్టర్ చేతుల మీదుగా టీబీ పేషెంట్లకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. క్షయవ్యాధితో బాధపడేవారు సమయానుకూలంగా మందులు వేసుకోవాలని, చక్కటి పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల వ్యాధినుంచి త్వరగా కోలుకుంటారన్నారు. స్వచ్ఛంద, కార్పొరేట్ సంస్థలు క్షయ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకోవడానికి ముందుకు రావాలని కోరారు. జిల్లా వైద్యాధికారి అప్పయ్య మాట్లాడుతూ.. క్షయవ్యాధి లేని సమాజాన్ని నిర్మించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి హిమబిందు, మాస్ మీడియా అధికారి అశోక్ ప్రసన్నకుమార్, మనస్ హెల్పింగ్ హ్యాండ్స్ ఫర్ ఆర్ఫన్ చిల్డ్రన్ సంస్థ మహేశ్, జిల్లా టీబీ కోఆర్డినేటర్లు సుష్మ, నగేష్, సూపర్‌వైజర్ విజయ్, హెల్త్ విజిటర్ అంజమ్మ, సునీత తదితరులున్నారు.

ఇన్నర్ రింగ్‌రోడ్డు పనులపై సమీక్ష



సమీక్షలో పాల్గొన్న వరంగల్ కలెక్టర్, కమిషనర్, 'కుడా' చైర్మన్, అధికారులు

న్యూశాయంపేట: వరంగల్ నగరాభివృద్ధిలో భాగంగా ఇన్నర్ రింగ్‌రోడ్డు పనులపై వరంగల్ కలెక్టరేట్‌లో కలెక్టర్ సత్యశారద బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఖిలావరంగల్, ఉర్సు, ఏనుమాముల, గొర్రెకుంట ప్రాంతాల్లో చేపట్టిన ఇన్నర్ రింగ్‌రోడ్డులో భూములు కోల్పోయిన వారికి త్వరగా పరిహారం ఇప్పించాలని డివిజనల్ రెవెన్యూ అధికారి, తహసీల్దార్లను ఆదేశించారు. సమీక్షలో 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, గ్రేటర్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, టీపీఓ అజిత్‌రెడ్డి, కేఎంటీపీ జెడ్ఎం స్వామి, అధికారులున్నారు.

మహిళలు ఆత్మగౌరవంతో జీవించాలి

- స్థానిక ఎన్నికల్లో పోటీకి సమాయత్తమవ్వాలి
- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



కొత్త రేషన్‌కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు, వరంగల్ కలెక్టర్ సత్యశారద

హన్మకొండ: మహిళలు ఆర్థికంగా ఎదిగి ఆత్మగౌరవంతో జీవించాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. బుధవారం హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో ఇందిరా మహిళా శక్తి సంబురాలు నిర్వహించారు. ఈసందర్భంగా వర్ధన్నపేట, పర్వతగిరి, ఐనవోలు, హసన్‌పర్తి మండలాల స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు, నూతన రేషన్‌కార్డులను వరంగల్ కలెక్టర్ సత్యశారదతో కలిసి ఎమ్మెల్యే నాగరాజు అందించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సెర్ప్ ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు రూ.10 లక్షల ప్రమాద బీమా, రూ.22 లక్షల రుణ బీమా, రూ.40.45 కోట్ల బ్యాంకు లింకేజీ, రూ.7.76 కోట్ల వడ్డీ లేని రుణాలు, నూతన రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. మహిళలు ఎన్నికల్లో పోటీ చేయాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. రేషన్ కార్డులు నిరంతర ప్రక్రియ అని అర్హులందరికీ రేషన్‌కార్డులిస్తామన్నారు. అనంతరం స్వయం సహాయక సంఘాలచే ప్రదర్శించిన ఉత్పత్తులను కలెక్టర్, ఎమ్మెల్యేలు పరిశీలించారు. కార్యక్రమంలో వరంగల్ అదనపు కలెక్టర్ సంధ్యారాణి, సెర్ప్ డైరెక్టర్ నవీన్, వరంగల్ జెడ్పీ సీఈఓ రామిరెడ్డి, హనుమకొండ డీఆర్డీఓ మేన శ్రీను, వరంగల్ డీఆర్డీఓ కౌసల్యాదేవి, వరంగల్ ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

● కేయూ రిజిస్ట్రార్ రామచంద్రం

కేయూ క్యాంపస్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కేయూ రిజిస్ట్రార్ వి.రామచంద్రం అన్నారు. బుధవారం హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్అండ్ సైన్స్‌కాలేజీలో భౌతిక శాస్త్ర విభాగంలో ఆధ్వర్యంలో ఎల్ఈడీ బల్బుల తయారీపై నిర్వహించిన రెండురోజుల వర్క్ షాప్ ప్రారంభ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. డిగ్రీలతో ఉద్యోగావకాశాలు తక్కువ అని తెలిపారు. ప్రస్తుతం ఎంబీబీఎస్ కోర్సు పూర్తి చేసి ఎండీ చేస్తేనే వైద్య వృత్తికి ఉపయోగపడుతుందన్నారు. అనంతరం ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.జ్యోతి, వర్క్‌షాప్ కన్వీనర్ వరలక్ష్మి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రెహమాన్ మాట్లాడారు. ఈసీఐఎల్ పూర్వ ఉద్యోగి ఎల్ఈడీ బల్బుల తయారీ విధానం వివరించారు. సమావేశంలో అధ్యాపకులు జితేందర్, ప్రవీణ్, ఎ. సరిత, సరిత, ప్రశాంత్, కరుణాకర్, నాగయ్య, ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అల్యుమిని ఔదార్యం అభినందనీయం

● నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ



విద్యార్థినికి ఇంపాక్ట్ -99 స్కాలర్‌షిప్ అందజేస్తున్న నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ

కాజీపేట అర్బన్ : నిట్ 99వ బ్యాచ్ అల్యుమిని విద్యార్థులు ఇంపాక్ట్-99 పేరిట పేద, ప్రతిభ గల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేయడం అభినందనీయమని నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ అన్నారు. నిట్ వరంగల్‌లోని బోస్ సెమినార్ హాల్ కాంప్లెక్స్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ఇంపాక్ట్-99 స్కాలర్‌షిప్ పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిట్ వరంగల్ కళాశాలలో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించి ఇన్‌స్టిట్యూట్ రుణం తీసుకునేందుకు 99వ బ్యాచ్ విద్యార్థులు ఇంపాక్ట్-99 (ఇన్‌స్పైరింగ్ మీనింగ్ ఫుల్ ప్రోగ్రెస్ అండ్ అల్యుమిని కంట్రిబ్యూషన్స్ టూగెదర్)ను ఏర్పాటు చేసి విద్యార్థులకు చేయూతనందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. 99వ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఈసీఈ విభాగం పి.స్వర్ణలత, కెమికల్ విభాగం నుంచి జాన్.జేలు పాల్గొని నిట్‌కు చెందిన 2 నుంచి 4వ ఇయర్ విద్యార్థుల్లో 22 మందికి రూ.4.58 లక్షల ఆర్థిక సాయం అందజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్ : మానుకోట మున్సిపల్ పరిధిలోని అనంతారంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఫార్మసీ కళాశాలలో ప్రిన్సిపల్, గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ జి.అన్నపూర్ణ బుధవారం తెలిపారు. ప్రిన్సిపాల్ పోస్టుకు 10 సంవత్సరాల బోధన అనుభవం, ఎంఫార్మసీతోపాటు సర్వీస్ సర్టిఫికెట్లు, పీహెచ్‌డీ ఉన్న అభ్యర్థులు అర్హులన్నారు. అలాగే, గెస్ట్ లెక్చరర్ పోస్టులకు బీఫార్మసీ, ఎంఫార్మసీతో పాటు సర్వీస్ సర్టిఫికెట్లు ఉన్న అభ్యర్థులు అర్హులన్నారు. ఈ నెల 19న సాయంత్రం 4గంటల వరకు జిరాక్స్ పత్రాలతో కళాశాలలో దరఖాస్తులు అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు 8897434233 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

జిల్లా ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా ప్రవీణ్‌కుమార్

కాజీపేట అర్బన్ : రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్‌శాఖ వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా కరీంనగర్ జిల్లా రిజిస్ట్రార్ ప్రవీణ్‌కుమార్‌ను నియమిస్తూ బుధవారం ప్రభుత్వ స్పెషల్ సెక్రటరీ రాజీవ్‌గాంధీ హన్మంతు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా రిజిస్ట్రార్ ఫణీందర్‌ను హైదరాబాద్ జిల్లా రిజిస్ట్రార్‌గా, ఆఫీస్ డ్యూటీలో భాగంగా ఫుల్ అడిషనల్ చార్జి జిల్లా రిజిస్ట్రార్‌గా మహబూబ్‌నగర్‌కు బదిలీ చేశారు.

కొత్త బంగారు లోకం..



కోటి ఆశలతో కళాశాల విద్యలోకి విద్యార్థుల అడుగు..

- విద్యార్థి జీవితంలో ఉన్నత విద్యే కీలకం
- ఇక్కడ మంచిగా చదువుకుంటేనే లక్ష్య సాధన సాధ్యం
- ఆకర్షణలకు లోనైతే భవిష్యత్ అంధకారం
- అప్రమత్తంగా ఉండాలంటున్న మానసిక వైద్య నిపుణులు

ప్రతీ విద్యార్థి జీవితంలో కళాశాల (ఉన్నత) విద్య కీలకం. ఈ విద్యే విద్యార్థి భవిష్యత్‌ను నిర్ణయించేంది. ఇక్కడ ఉన్నత లక్ష్యాలు, ఆశయాలతో నిరంతరం కష్టపడి విద్యనభ్యసిస్తేనే భవిష్యత్ పూలబాట అవుతుంది. లేదంటే ముల్లబాటే. ప్రాథమిక విద్య పూర్తయిన అనంతరం కోటి ఆశలతో విద్యార్థులు కళాశాల చదువులోకి అడుగుపెడుతారు. క్రమశిక్షణగా విద్యనభ్యసిస్తేనే అనుకున్న లక్ష్యం నెరవేరి జీవితం బంగారుమయమవుతుంది. లేనిపక్షంలో ఆకర్షణలకు లోనై పక్కదారి పడితే మాత్రం అంతే సంగతులు. ఈ సమయంలో జాగ్రత్తగా ఉండాలి. కళాశాలలో అడుగుపెట్టే విద్యార్థులకు భయం.. అవగాహన లోపం ఉంటుంది. స్వేచ్ఛాయుత వాతావరణం.. కొత్త పరిచయాలు మార్పులు తీసుకొస్తాయి. ఈ క్రమంలో తెలియకుండానే కొన్ని పొరపాట్లకు అవకాశం ఇస్తుంటారు. ఉన్నత విద్యలో ప్రవేశించే విద్యార్థులు.. వ్యక్తిత్వ నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలి. అప్పుడే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారు. ఈ క్రమంలో ఉన్నత విద్యలో ప్రవేశించే విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

కాజీపేట: కళాశాలలో చేరిన కొత్తలో చాలా మంది విద్యార్థుల్లో భయం ఉంటుంది. పది మందిలో మాట్లాడలేరు. ఎవరెమనుకుంటారోననే భావనతో ఉంటారు. ఈ లక్షణాలు కొన్నాళ్లపాటు ఉంటాయి. ఆ తర్వాత అలవాటు పడుతారు. మరికొందరు ఇదే ఆలోచనతో ఉండిపోతారు. ఫలితంగా ఎంత ప్రతిభ ఉన్నా.. వెలుగులోకి రాలేరు. ఇదే భావన వారిని వేధిస్తుంది. ఈ ధోరణిని వీడేందుకు స్వీయ ప్రయత్నాలు చేయాలి. విద్యతోపాటు తరచూ క్రీడలు, సాంస్కృతిక, క్విజ్, వక్తృత్వం, వ్యాసరచన పోటీల్లో పాల్గొనాలి. గెలుపోటములను పక్కన పెడితే పాల్గొనడం ద్వారా ఆత్మవిశ్వాస లక్షణాలు పెంపొందుతాయి.

స్నేహితుల ఎంపికే కీలకం..

ప్రస్తుత రోజుల్లో ఎలాంటి ప్రతిఫలం ఆశించని స్నేహితులు కొందరు మాత్రమే ఉంటారు. స్నేహం పేరిట లాభపడాలని చూసేవారే తప్ప సాయపడే వారు చాలా తక్కువ ఉంటారు. ఈ క్రమంలో కళాశాల వాతావరణం కొత్త స్నేహాలను ఏర్పరుస్తుంది. అయితే ఇక్కడ అప్రమత్తంగా ఉండాల్సింది స్నేహితుల ఎంపికలోనే. కొత్త వ్యక్తుల పరిచయాలు, అలవాట్లు నిశ్చితంగా పరిశీలించాలి. కొందరు మంచితనం నటిస్తూ తమ అవసరాలు తీర్చుకుంటారు. మరికొందరు పొగడ్తలతో ఆకర్షిస్తుంటారు. అహంకారం ప్రదర్శించే వారికి ఎంత దూరంగా ఉంటే అంత మేలు.

ఆకర్షణలొద్దు..

యువతలో భావోద్వేగాలను ప్రభావితం చేసేది ఆకర్షణ. ప్రేమ, బైక్, ఫ్యాషన్, అలంకరణ, దురాలవాట్లకు యువత ఆకర్షితులవుతుంది. వీటి వల్ల భవిష్యత్ కోల్పోయే పరిస్థితులు ఉంటాయి. ఇలా కాకుండా లక్ష్యం ఏర్పరుచుకుని నిరంతరం చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి.

తల్లిదండ్రుల పాత్ర కీలకం..

యువత సన్మార్గంలో నడవడంలో తల్లిదండ్రుల పాత్ర కీలకం. పిల్లల ప్రవర్తన గమనిస్తూ ఉండాలి. బాగా చదువుతున్నారా..? వెనుకబడ్డారా..? అని గుర్తించాలి. పరధ్యానంగా ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ ఉంటే వారి ఇబ్బందులు గమనించాలి. సమస్య పరిష్కారానికి అవసరమైన సూచనలు చేయాలి. లేదా మానసిక నిపుణులను సంప్రదించి వారి సందేహాలను నివృత్తి చేయాలి.

ఆత్మ పరిశీలనకు ప్రాధాన్యం ముఖ్యం..

సాధారణంగా 16 నుంచి 21 ఏళ్ల లోపు యువత వ్యవహార శైలి చంచలంగా ఉంటుంది. స్థిరమైన నిర్ణయాలు తీసుకోలేరు. భావోద్వేగాలు తీవ్ర స్థాయిలో ఉంటాయి. నిర్ణయాత్మక శక్తి తక్కువ. మంచి, చెడు కన్నా .. అనుకున్నది చేయాలనే పట్టుదలతో ఉంటారు. ఈ క్రమంలో ఆకర్షణలకు లోనై వ్యసనాలకు దగ్గరవుతుంటారు. ఫలితంగా చిన్న వయసులోనే విలువైన జీవితాలను కోల్పోతున్న వారిని నిత్యం చూస్తున్నాం. యువత ఆత్మ పరిశీలనకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల సత్ఫలితాలు పొందుతారు.

మనస్సు అదుపులో ఉండాలి..



టీనేజీలో మనస్సు తరంగాల్లా ఎగిసిపడుతుంది. మనస్సును అదుపులో ఉంచుకోవాలి. చదువు, సరదాలను సమతూకం చేయాలి. ప్రతీ అడుగు అప్రమత్తంగా వేయాలి. అభిరుచికి తగ్గట్లు కోర్సు, ఉన్నతికి దోహదపడే స్నేహితులను మాత్రమే ఎంపిక చేసుకోవాలి. ఇదే సగం విజయం. లక్ష్య సాధనకు ప్రణాళికాప్రకారం ముందుకు సాగితే కొత్త బంగారు లోకం కల సాకారమవుతుంది.

బరుపాటి గోపి,
మానసిక వైద్య నిపుణుడు

కళాకారుల సమస్యల పరిష్కారానికి కృషి

● సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ జీవీ వెన్నల



సదస్సులో మాట్లాడుతున్న జీవీ వెన్నల

నయీంనగర్: బ్యాండ్ వాయిద్య కళాకారుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ డాక్టర్ జీవీ వెన్నల అన్నారు. బుధవారం బ్యాండ్ వాయిద్య కళాకారుల సంఘం రాష్ట్ర సదస్సు హనుమకొండ ఈద్గా సిటిజన్ హాల్‌లో జరిగింది. ఈ సదస్సుకు వెన్నెల ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ బ్యాండ్ వాయిద్య కళాకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎంవీ రమణ, హనుమకొండ జిల్లా కన్వీనర్ లింగయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో బ్యాండ్‌వాయిద్య వృత్తే జీవనాధారంగా లక్షలాదిమంది జీవిస్తున్నారన్నారు. అన్ సీజన్‌లో అడ్డమీద కూలీలుగా జీవనం గడుపుతున్నారని, వీరికి ప్రభుత్వ పథకాలు అందజేసి ఆదుకోవాలని కోరారు. ప్రతీ కళాకారుడికి గుర్తింపు కార్డు, జీవిత బీమా, ఆర్థిక సాయం, ఆరోగ్య భద్రత, ఇళ్ల స్థలాలు, పింఛన్, 3 ఎకరాల భూమి ఇచ్చి ఆదుకోవాలని కోరారు. గుమ్మడిరాజు నాగరాజు అధ్యక్షతన జరిగిన సదస్సులో సంఘం నాయకులు రాజాసాబ్, చాంద్‌పాషా, శంకర్, అంజయ్య, బషీర్, వెంకన్న, మల్లేశం, గొడుగు వెంకట్, ఓదెలు, సాంబయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పురాతన వస్తువులు అందజేయాలి

● జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి గడ్డం వెంకన్న



మ్యూజియంలోని వస్తువులు



మాట్లాడుతున్న పీఠాధిపతి వెంకన్న

హన్మకొండ కల్చరల్ : చరిత్రను అర్థం చేసుకోవడానికి, సంరక్షించుకోవడానికి, ప్రజలకు అవగాహన కల్పించడం తోపాటు గతం గురించి అధ్యయనం చేయడానికి ఉపయోగపడే పురాతన వస్తువులు, ప్రాచీన కళాఖండాలను జానపద గిరిజన విజ్ఞానపీఠానికి అందజేయాలని పీఠం పీఠాధిపతి గడ్డం వెంకన్న కోరారు. బుధవారం వరంగల్ హంటర్‌రోడ్‌లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞానపీఠంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీఠం స్థాపించి 30సంవత్సరాలు పూర్తయిందన్నారు. పీఠంలో అరుదైన జానపద వస్తువులతో మ్యూజియం ఏర్పాటు చేశామన్నారు. మ్యూజియంలోని వస్తువులు ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు భవిష్యత్ తరాలకు చరిత్రను తెలుసుకోవడానికి సాయపడతాయన్నారు. ఇందుకోసం ఉమ్మడి వరంగల్ జిల్లా వాసులు తమ వద్ద ఉన్న ఉపయోగంలో ఉన్నా లేకపోయిన పురాతన రాతి, లోహ, చెక్క సంబంధ వంట సామాను, ఇంటి వస్తువులు, పనిముట్లు తదితర వస్తువులను అందజేయాలని కోరారు. వస్తువులు అందజేసిన వారి వివరాలు నమోదు చేస్తామని తెలిపారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ క్షమంతుల దామోదర్, డాక్టర్ బాసాని సురేశ్, డాక్టర్ చూరేపల్లి రవికుమార్, అబ్బు గోపాల్‌రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ డాక్టర్ గంపా సతీశ్, సిబ్బంది పాల్గొన్నారు.

బహుజన ఉద్యమకారుడు | ప్రభంజన్ కుమార్ కన్నుమూత

- పార్థివదేహం జనగామ మెడికల్ కాలేజీకి అప్పగింత
- మాజీ సీఎం కేసీఆర్‌తోపాటు పలువురు ప్రముఖుల సంతాపం



ప్రొఫెసర్ ప్రభంజన్ కుమార్ (ఫైల్)

పాలకుర్తి టౌన్/ జనగామ: బహుజన, సామాజిక ఉద్యమకారుడు, సీనియర్ జర్నలిస్టు ప్రొఫెసర్ డాక్టర్ యాదనాల ప్రభంజన్‌కుమార్ యాదవ్(62)బుధవారం తెల్లవారుజామున హైదరాబాద్‌లో కన్నుమూశారు. కొన్ని నెలల క్రితం క్యాన్సర్ బారిన పడిన ఆయన పరిస్థితి విషమించడంతో చనిపోయారు. ప్రభంజన్‌కుమార్ స్వస్థలం జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని గూడూరు గ్రామం. ప్రముఖ రచయిత, కవి గూడ అంజయ్య సోదరుడి కూతురు, మంచిర్యాల మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రేఖను వివాహం చేసుకున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులున్నారు. ప్రభంజన్‌కుమార్ నిజామాబాద్‌లో డిగ్రీ, పీజీ ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేశారు. ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్(ఐఐఎస్) సాధించారు. 1998లో ఐఐఎస్ అధికారిగా ఆలిండియా రేడియోలో డిప్యూటీ ఎడిటర్‌గా విధులు నిర్వర్తించారు. ఆ తర్వాత జాతీయ ప్లానింగ్ కమిషన్ పీఆర్‌ఓగా కొద్ది రోజులు పనిచేసి రాజీనామా చేశారు. తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. వామపక్ష ఉద్యమాల్లో కీలకపాత్ర పోషిస్తూ డోలుదెబ్బ, యాదవ ఇంటలెక్చువల్ ఫోరం స్థాపించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య చిత్రం రూపురేఖలను మొదట ప్రజంటేషన్ చేశారు. కాకతీయ, తెలంగాణ యూనివర్సిటీల్లో జర్నలిజం విభాగాలను స్థాపించడంలో ఆయన ముఖ్య భూమిక పోషించారు. తెలంగాణ యూనివర్సిటీ జర్నలిజం విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేసి 2017లో వీఆర్ఎస్ తీసుకున్నారు. పలు పత్రికలతోపాటు విద్యారంగానికి అనేక విధాలా సేవలందించారు.

జనగామ మెడికల్ కాలేజీకి పార్థివదేహం అప్పగింత..

ప్రొఫెసర్ డాక్టర్ యాదనాల ప్రభంజన్‌కుమార్ యాదవ్ పార్థివదేహాన్ని కుటుంబ సభ్యులు జనగామ మెడికల్ కాలేజీకి అప్పగించారు. అంతకు ముందు మృతదేహాన్ని తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ జీవీ వెన్నల సందర్శించి నివాళులర్పించారు. అదేవిధంగా డాక్టర్ చెరుకు సుధాకర్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎంపీ రాపోలు ఆనందభాస్కర్, ఎమ్మెల్సీ బండా ప్రకాశ్, కదిరే కృష్ణ, బత్తుల సిద్దేశ్వర్, రచయితలు డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్, డాక్టర్ రాపోలు సత్యనారాయణ, మార్గం లక్ష్మీనారాయణ, కన్నా పరుశరాములు, కోలా జనార్దన్, మెరుగు బాబు యాదవ్, గుమ్మడిరాజు సాంబయ్య, పులి గణేశ్,సంగి వెకన్న సంతాపం తెలిపారు.

మాజీ సీఎం సంతాపం

ప్రభంజన కుమార్ మృతిపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తీవ్ర సంతాపం ప్రకటించారు. ఆయన మరణం సామాజిక ఉద్యమాలకు తీరని లోటని పేర్కొన్నారు. ప్రభంజన్ కుమార్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సైన్స్ కాంగ్రెస్‌కు రిజిస్ట్రేషన్ల సంఖ్య పెంచాలి

● కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఆగస్టు 19, 20, 21 తేదీల్లో మూడు రోజులు నిర్వహించబోయే తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌కు వివిధ యూనివర్సిటీల నుంచి అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థుల రిజిస్ట్రేషన్ల సంఖ్య పెంచేలా కృషిచేయాలని కేయూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి కోరారు. బుధవారం క్యాంపస్‌లోని కమిటీ హాల్‌లో సైన్స్ విభాగాల అధిపతులు, ప్రొఫెషనల్స్ కాలేజీల ప్రిన్సిపాళ్లతో తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 98 అబ్‌స్ట్రాక్ట్‌లతోకూడిన రిజిస్ట్రేషన్లు అయ్యాయన్నారు. ఈనెలాఖరు వరకు సమయం ఉందని, అప్పటిలోగా ఎక్కువ మంది సైన్స్‌కాంగ్రెస్‌లో భాగస్వాములయ్యేలా నమోదు సంఖ్య పెంచాలని సూచించారు. ఈనెల15న నిర్వహించిన మానిటరింగ్ కమిటీలో తీసుకున్న నిర్ణయాలను కూడా వివరించారు. ప్రధానంగా వనరుల సమీకరణ, వసతుల ఏర్పాట్లుకు సంబంధించిన వివరాలను సైన్స్‌కాంగ్రెస్ లోకల్ సెక్రటరీ బి. వెంకట్రామ్‌రెడ్డి తెలిపారు.

లండన్‌లో బోనాల జాతర



పోతురాజుల వేషధారణలో ఎన్ఆర్ఐలు

హన్మకొండ కల్చరల్: వరంగల్ ఎన్ఆర్ఐ ఫోరం ఆధ్వర్యంలో బుధవారం ఆషాఢమాసం బోనాల జాతర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈస్ట్ లండన్‌లోని మహాలక్ష్మి ఆలయంలో జరిగిన కార్యక్రమంలో వరంగల్ ఎన్ఆర్ఐ ఫోరం అధ్యక్షప్ర శ్రీధర్‌నీలా, గుండు రజిత బోనాల వేడుకను ప్రారంభించారు. శ్రీధర్‌నీలా 'సాక్షి'తో మాట్లాడుతూ.. దుర్గమ్మను ప్రతిష్ఠించామని, తెలంగాణలో జరుగుతున్న విధంగానే బోనం ఎత్తుకుని అమ్మవారికి దీపారాధన, పూజలు జరిపామని తెలిపారు. యూకే నలుమూలల నుంచి 2500కిపైగా ప్రవాస భారతీయులు పాల్గొన్నట్లు తెలిపారు.

మహిళలు రాజకీయంగా రాణించాలి

- రాష్ట్ర ప్రణాళిక బోర్డు ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి
- మహిళా నాయకత్వ శిక్షణ శిబిరం ప్రారంభం



సదస్సులో ఎమ్మెల్యే నాయిని తదితరులు



మాట్లాడుతున్న చిన్నారెడ్డి

హన్మకొండ చౌరస్తా: మహిళలు రాజకీయంగా రాణించాలని, అప్పుడే సమాజం నిజమైన అభివృద్ధి సాధిస్తుందని తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక బోర్డు వైస్ ప్రెసిడెంట్ చిన్నారెడ్డి అన్నారు. హనుమకొండ హంటర్‌రోడ్ లోని 'డి' కన్వెన్షన్ హాల్‌లో బుధవారం కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో మహిళలను రాజకీయంగా చైతన్య పరిచి, నాయకత్వ లక్షణాలు పెంపొందించడమే లక్ష్యంగా శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సమావేశానికి చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ, నాయకత్వం చూపే మహిళలకు మార్గదర్శిగా నిలుస్తుందన్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ భారత మొదటి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ స్ఫూర్తితో మహిళలు రాజకీయంగా రాణించాలన్నారు. ఇందిరమ్మ మార్గంలో పయనిస్తూ దేశాన్ని శాసించే స్థాయికి ఎదగాలన్నారు. మహిళలను రాజకీయంగా, ఆర్థికంగా బలోపేతం చేయడానికి తెలంగాణ ప్రభుత్వం రేషన్ కార్డు నుంచి మొదలు.. ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం వరకు మహిళలనే యజమానులుగా పరిగణిస్తోందన్నారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకెళ్లాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ సర్కారు అత్యధిక ప్రాధాన్యమిస్తూ ప్రోత్సహిస్తోందన్నారు. కార్యక్రమంలో వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవీ శ్రీనివాస రావు, మహిళా అధ్యక్షురాలు బంక సరళ, మాజీ ఎంపీ దయాకర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు నిధులు

- హనుమకొండకు రూ.73.20లక్షలు, వరంగల్‌కు రూ.1.36కోట్లు
- మౌలిక సదుపాయాల కల్పనకు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలకే అప్పగింత
- మరమ్మతులు, నీటి సౌకర్యం తదితర పనులు చేపట్టాలి..

విద్యారణ్యపురి: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, వివిధ మరమ్మతులు చేపట్టేందుకు ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ నిధులు మంజూరు చేశారు. హనుమకొండ జిల్లాలోని 9 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా, అందులో ఆరింటికి రూ.73.20లక్షలు మంజూరయ్యాయి. హనుమకొండ వడ్డెపల్లిలోని ప్రభుత్వ పింగిళి బాలికల జూనియర్ కాలేజీకి మరమ్మతులు, వాటర్ సరఫరా, ఎలక్ట్రిఫికేషన్‌కు మొత్తంగా రూ.15లక్షలు, హసన్‌పర్తి ప్రభుత్వ జూనియర్ కాలేజీకి రూ.12.80లక్షలు, ధర్మసాగర్ కాలేజీకి రూ.13లక్షలు, ఆత్మకూరు కళాశాలకు రూ.4.40లక్షలు, పరకాల జూనియర్ కళాశాలకు రూ.13లక్షలు, శాయంపేట కళాశాలకు రూ.15లక్షలు మంజూరయ్యాయి.

వరంగల్ జిల్లాలో కళాశాలలకు కూడా

వరంగల్ జిల్లాలోని 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలలుండగా, అందులో పదింటికి రూ.1.36కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఖానాపూర్ కళాశాలకు రిపేర్లు, వాటర్ సప్లై, ఎలక్ట్రిఫికేషన్, తాగునీటి సదుపాయం కల్పనకు రూ.15లక్షలు, నర్సంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రూ.15లక్షలు, నర్సంపేట గర్ల్స్ జూనియర్ కాలేజీకి రూ.15లక్షలు, వర్ధన్నపేట కాలేజీకి రూ.8.50లక్షలు, రాయపర్తి కాలేజీకి రూ.15.30లక్షలు, నెక్కొండ కళాశాలకు రూ.14లక్షలు, సంగెం కళాశాలకు రూ.15లక్షలు, గీసుకొండ కళాశాలకు రూ8.20లక్షలు, రంగశాయిపేట కళాశాలకు రూ.15లక్షలు, వరంగల్‌లోని క్రిష్ణకాలనీ బాలికల జూనియర్ కాలేజీకి రూ.15లక్షలు నిధులు మంజూరయ్యాయి.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకే..

ప్రభుత్వ పాఠశాలల మాదిరిగానే ప్రభుత్వ జూనియర్ కాలేజీల పనులను కూడా అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలకే అప్పగించాలని ఆదేశాలు వచ్చాయి. ఆయా కళాశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేసుకోవాలి. పనులను వారికి అప్పగించేందుకు ఇంటర్ విద్య అధికారులు ఇప్పటికే ఆయాకాలేజీల ప్రిన్సిపాళ్లతో సమావేశమై ఆదేశించారు.

పనులపై పర్యవేక్షణ చేయాలి..

రాష్ట్ర విద్యమౌలిక సదుపాయల సంస్థలోని ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో అమ్మ ఆదర్శపాఠశాలల కమిటీలు పనులు చేపట్టాల్సింటుంది. ఆయా కాలేజీల ప్రిన్సిపాళ్లు పనులు సరిగా జరిగేలా పర్యవేక్షణ చేయాల్సింటుంది. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు అధికారులకు పంపాల్సింటుంది.

- ఎ.గోపాల్, శ్రీధర్‌సుమన్,
హనుమకొండ, వరంగల్ డీఐఈఓలు

22 వరకు దరఖాస్తు చేసుకోవాలి

న్యూశాయంపేట: అత్యంత వెనుకబడిన తరగతుల సహకార సంస్థ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ ఎంబీసీ యువతి, యువకులకు సాఫ్ట్‌స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, రెస్యూమే బిల్డింగ్, కమ్యూనికేషన్ ఫౌండేషన్, మాక్ ఇంటర్వ్యూ, సెల్ఫ్ కాన్ఫిడెన్స్ బిల్డింగ్, మెంటల్ వెల్‌బీయింగ్ పెంపొందించడానికి నాలుగు రోజుల ఉచిత నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు వరంగల్ జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి ఎ.పుష్పలత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ సమయంలో అభ్యర్థులకు ట్రావెలింగ్ అలవెన్స్, భోజనం, వసతి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 22 వరకు గడువు పొడిగించినట్లు తెలిపారు.

ప్రభుత్వ కళాశాలల్లో ఐఐటీ, నీట్ తరగతులు

● వరంగల్ డీఐఈఓ శ్రీధర్‌సుమన్




మాట్లాడుతున్న వరంగల్ డీఐఈఓ శ్రీధర్‌సుమన్

విద్యారణ్యపురి: జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఐఐటీ, నీట్ తదితర పోటీపరీక్షలకు విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని, అందుకు సంబంధించిన ఫిజిక్స్ వాలా టైంటేబుల్‌ను కచ్చితంగా పాటించాలని వరంగల్ డీఐఈఓ శ్రీధర్ సుమన్ అన్నారు. హనుమకొండలోని డీఐఈఓ కార్యాలయంలో జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటర్ సైన్స్ విద్యార్థుల కోసం ఫిజిక్స్ వాలా సౌజన్యంతో ఆన్‌లైన్ ఉచిత శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. సైన్స్ అధ్యాపకులు, ప్రిన్సిపాళ్లు ప్రతిరోజూ నిర్ణీత సమయంలో విద్యార్థులకు శిక్షణఇప్పించాలని చెప్పారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసేందుకు అసైన్‌మెంట్లు, వాటి మూల్యాంకనం తదితర అంశాలపై దృష్టి సారించాలని ఆయన సూచించారు.

విధుల్లో నిర్లక్ష్యం వీడాలి

● టీజీఎస్పీ బెటాలియన్ల డీఐజీ సి.సన్నీ



మాట్లాడుతున్న డీఐజీ సి.సన్నీ

మామునూరు: టీజీఎస్పీ అధికారులు, సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా నిరంతర అప్రమత్తంగా ఉండాలని టీజీఎస్పీ పటాలియన్ల డీఐజీ సి.సన్నీ సూచించారు. వార్షిక తనిఖీలో భాగంగా బుధవారం మామునూరు టీజీ ఎస్పీ 4వ బెటాలియన్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. పలు విభాగాల్లో తనిఖీలు నిర్వహించారు. మొదటగా బెటాలియన్ కమాండెంట్ బి.రాంప్రకాష్ అయనకు పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానం పలికారు. ఆ తర్వాత మోటార్ ట్రాన్స్‌పోర్ట్, బెటాలియన్ వెల్ఫేర్, హెడ్ క్వార్టర్, యూనిట్ హాస్పిటల్, పెట్రోల్ బంక్, క్యూఎం ఆఫీసులను తనిఖీ చేసి వాటి నిర్వహణను పరిశీలించారు. సిబ్బంది యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం వహించకూడదని తెలియజేశారు. అసిస్టెంట్ కమాండెంట్లు కృష్ణ ప్రసాద్, శ్రీనివాస్ రావు, వీరన్న, ఆర్ఐలు, ఆర్ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.